క్లుప్తంగా

నేడు మాంసం, చేపల విక్రయాల నిషేధం

సామర్లకోట: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఆదివారం చేపలు, మాసం విక్రయాలను నిషేధించినట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సైతం వాటి విక్రయించొద్దని హెచ్చరించారు. ఈ మేరకు ముందుగా విక్రయదారులకు నోటీసులు అందజేసినట్టు తెలిపారు. సచివాలయాల శానిటరీ కార్యదర్శులు, మున్సిపల్ శానిటరీ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. అదే విధంగా రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగే జాతీయ పతాక ఆవిష్కరణకు పాలక మండలి సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

సాక్షి స్పెల్‌బీలో నిహాల్ ప్రతిభ


అందుకున్న సర్టిఫికెట్‌తో నిహాల్

పెద్దాపురం: సాక్షి స్పెల్‌బీ జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక ఆదిత్య స్కూల్ విద్యార్థి లెక్కల నిహాల్ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం రాబర్ట్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో నిహాల్ మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి రజత పథకంతో పాటు రూ.ఐదు వేల నగదు బహుమతిని అందుకున్నారని ఆయన తెలిపారు. నిహాల్‌ను ఎంఈఓ వీఆర్‌కే చౌదరి, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి తదితరులు అభినందించారు.

గోర్సలో పశు ఆరోగ్య శిబిరం


శిబిరంలో పాడి రైతులకు మందులను అందజేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని గొర్సలో శనివారం నాగులపల్లి పశువైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రొంగల వీరబాబు ప్రారంభించారు. శిబిరంలో 57 పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. పశువుల ఆరోగ్యానికి చికిత్స, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రణకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. మండలంలో సోమవారం కుతుకుడుమిల్లి, శ్రీరాంపురం, 28న కొండెవరం, పొన్నాడ, 29న కొమరగిరిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో..

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువైద్యాధికారి శ్రావ్య పాల్గొని మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పశు వైద్య కేంద్రాలలో టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించడానికి ఉచితంగా గడ్డి విత్తనాలు, వడ్డీలేని రుణా లు ఇస్తున్నట్టు తెలిపారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు వితరణ

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉమ్మిడి నూకరాజు, పిరమళ్ల మాంబిల్లి కుటుంబాలకు స్థానికురాలైన మడదా రాజేశ్వరి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి గత కొంతకాలంగా ఇలా ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతు ఒక వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలుకు చెందిన రాజనాల వెంకన్న వ్యవసాయం చేస్తూ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని తల్లి, తండ్రి భార్య మందలించగా మనస్తాపం చెంది ఈ నెల 21 తేదీ రాత్రి ఇంటి వద్దనున్న చెదల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బంధువులు అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి చిన్న కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎన్.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

సామర్లకోట: మండలం వేట్లపాలెం గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు, లక్ష తులసీ పూజ, అమ్మవార్లకు కుంకుమార్చనలు చేశారు.


కట్టమూరు-కాండ్రకోట రహదారి దుస్థితి ఇదీ..


కంకర గుట్టలతో దర్శనమిస్తున్న చదలాడ రోడ్డు

జిగ్‌జాగు దారులు

- తుస్సుమన్న పల్లె పండుగ
- నెరవేరని కూటమి ప్రభుత్వ లక్ష్యం
- పూర్తి కాని రహదారుల నిర్మాణం
- గోతులు, కంకర గుట్టలతో నిండిన వైనం

పెద్దాపురం: గుంతలు లేని రోడ్లే లక్ష్యమని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ విషయాన్నే మరచినట్టుంది. సంక్రాంతికల్లా కొత్త రోడ్లు వేసి పల్లె పండగ చేస్తామని ప్రకటించారు. కానీ పండగకు మూడు నెలల ముందు ఆర్భాటంగా ప్రారంభించి ఆనక మధ్యలోనే వదిలేశారు. దీంతో ప్రయాణికులకు గొతులను, గొప్పులను, గుట్టలను తప్పించుకుంటూ జిగ్‌జాగ్ ప్రయాణాలు చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. ఈ జాగుకు కారణమేంటో.. ఆ దారులు ఎప్పటికి పూర్తవుతాయో కాలమే చెప్పాలి.


నత్తనడకన సాగుతున్న చదలాడ రహదారి పనులు

చాలీ చాలని నిధులు..

ప్రధానంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖలకు కూటమి ప్రభుత్వం చాలీచాలని నిధులు విడుదల చేసింది. దీనికి మ్యాచింగ్ గ్రాంట్‌గా ఉపాధి హామీ నిధులను పంచాయతీ రాజ్ శాఖకు విడుదల చేసినప్పటికీ గ్రామీణ రహదారుల నిర్మాణాలు సగం వరకు మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణీకులు, వాహనచోదకులు, పాదచారుల అవస్థలు వర్ణనాతీతం.

మామూళ్ల మత్తు.. వాటాల పొత్తు?

పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఆ కూటమి నేతలే కాంట్రాక్టర్లుగా మారి, మామూళ్ల మత్తులో అధికారులు తలమునకలై సజావుగా జరగాల్సిన రహదారి పనుల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

నత్తనడకన ప్రధాన రహదారుల పనులు

మండలంలోని పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పెద్దాపురం-జగ్గంపేట ప్రధాన రహదారిలోని జె.తిమ్మాపురం వరకు చేపట్టాల్సిన నిర్మాణాలను తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. అలాగే కట్టమూరు-కాండ్రకోట రహదారి ఎన్నికల కోడ్‌తో నిలచిపోయింది. కోడ్ ముగిసిన తరువాత నాలుగు రోజులు హడావుడి చేసి మళ్లీ నిలిపివేశారు. దీంతో రహదారి కంకర గోతులతో నిలచిపోయింది.

కంకర గుట్టలతో చదలాడ రోడ్డు..

కాగా పులిమేరు శాంతివర్ధన పాఠశాల నుంచి చదలాడకు వెళ్లే పంచాయతీ రాజ్ నిర్మాణ పనులు సగంలోనే నిలిపివేశారు. కూటమి నేతలు కాంట్రాక్టర్‌గా వచ్చి రోడ్డును ఇరుభాగాలుగా చేసుకున్నారు. ఒక భాగంలో టీడీపీ నేత సీసీ రోడ్డు వేయగా, జనసేన నేత మిగిలిన భాగంలో కంకర గుట్ట వేసి వదిలేశారు.

దారుణంగా గోరింట-మల్లాం రహదారి

పెద్దాపురం, పిఠాపురం సెగ్మెంట్లను కలిపే మండలంలోని గోరింట-మల్లాం రహదారి దుస్థితి మరింత దారుణంగా మారింది. గోరింట గ్రామం నుంచి మల్లాం హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఈ అధ్వాన రహదారి వల్ల ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు వడ్లమూరు-పిఠాపురం మండలం గోవిందరాజుపాలెం రహదాని పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఆర్భాటం తప్ప పనులు శూన్యం



కూటమి నేతల ఆర్భాటాలు, ప్రగల్భాలు మినహా హామీల అమలు శూన్యమని చెప్పక తప్పదు. సామాజిక మాధ్యమాల్లో వాళ్ల హడావుడి అంతా ఇంతా కాదు. ఇప్పటికైనా రహదారి నిర్మాణాలు పూర్తి చేసి ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

– నల్లల గోవిందు, కట్టమూరు, పెద్దాపురం మండలం

త్వరలోనే పూర్తి చేస్తాం



పంచాయతీ రాజ్ రహదారుల నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. మండలంలో 11 రహదారులకు రూ.5.2 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం చేపడుతున్న రోడ్లు పెద్దవి కావడంతో పనులు వేగవంతం చేసి మార్చిలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– ఆర్.రామకృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఏఈ, పెద్దాపురం

నర్సింహయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి


నర్సింహయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ ఎంఎల్ జనశక్తి రాష్ట్ర నాయకుడు నంబి నర్సింహయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని పులిమేరు గ్రామంలో శనివారం నర్సింహయ్య వర్ధంతిని నిర్వహించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ నర్సింహయ్య నమ్మిన సిద్ధాంతం కోసం భూమి, భుక్తి, పీడిత ప్రజల కోసం నాలుగు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటాన్ని కొనసాగించారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారం అవసరమని ఆర్‌బీ పట్నం హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ మన్యం చిన్న అన్నారు. పాఠశాలకు అవసరమైన సుమారు రూ.20 వేల విలువైన జిరాక్స్ కమ్ ప్రింటర్‌ను, పేపర్లను దాతలు మద్దుకూరి నారాయణరావు, మేకా సతీష్‌కుమార్, మార్ని కాశీ విశ్వనాథం బహుకరించి చిన్న ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు.

ఉత్సాహంగా న్యాయవాదుల క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీలకు సిద్ధమైన న్యాయవాదులు

పిఠాపురం: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం న్యాయవాదుల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బార్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ జట్ల మధ్య పోటీ జరిగింది. తొలుత ఎస్ఎం అలీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన రాజారావు జట్టు నిర్ణీత 12 ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 133 పరుగులు సాధించింది. 134 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్ఎం అలీ జట్టు నిర్ణీత ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. మ్యాచ్‌లో సెంచరీ సాధించిన ఉప్పు అప్పారావు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. సోమిరెడ్డి కోటి, పెదిరెడ్ల నంది అంపైర్‌గా వ్యవహరించారు. విజేతలకు కోర్టు ఆవరణలో నిర్వహించే రిపబ్లిక్ దినోత్సవం సంబరాల్లో బహుమతులు అందజేస్తామని స్పోర్ట్స్ కార్యదర్శి మాగాపు బుజ్జి తెలిపారు.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం

పిఠాపురం: ఆవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న వ్యాన్‌ను శనివారం పట్టుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో జాతీయ రహదారి 16 రోడ్డులో చందుర్తి జంక్షన్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఒక బొలెరోలో ఈ ఆవులను గుర్తించినట్టు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. వాటిని దాలివలస గ్రామానికి చెందిన మేడిశెట్టి తాతారావు అక్రమంగా కబేలాకు తరలిస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వాహనాన్ని, ఆవులను స్వాధీనం చేసుకుని గోసంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న రాష్ట్ర స్థాయి నాటక పోటీలు


రెండో రోజు నాటక పోటీలను ప్రారంభిస్తున్న కోటి, అరుణ

పెద్దాపురం: మండలం చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి షష్టమ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక కళాపరిషత్ పోటీలు శనివారం రెండో రోజు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గుమ్ములూరి లక్ష్మీనారాయణ కళా ప్రాంగణంలో కురిమెళ్ల వెంకటరమణ, మురుకుర్తి సత్తిబాబు కళావేదికపై రాత్రి నాటికల ప్రదర్శించారు. కళా వేదికను ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం కోటి, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జీఎస్ఆర్ స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. తొలుత ప్రజా నాట్యమండలి కళాకారులు ఆర్.వీర్రాజు, డి.కృష్ణ, డి.సత్యనారాయణ, కేదారి నాగు తదితరులు డప్పు వాయిద్యాలతో పోటీలను ప్రారంభించారు. తొలుత దారపురెడ్డి అఖిల నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు క్రాంతికుమార్, కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి బుజ్జి, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, సీనియర్ కళాకారులు గోపు సత్తిబాబు, సీఎస్ఆర్ మూర్తి, స్నేహ ఆర్ట్స్ సభ్యులు యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి స్వేచ్ఛ ప్రమాదం

మొదటిగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ బృందం ప్రదర్శించిన 'స్వేచ్ఛ' నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. స్వేచ్ఛలో నిర్ణయాత్మక నియంత్రణ సంరక్షణతో కూడుకున్న స్వచ్ఛత ఉండాలని, అది లేకపోతే మనిషి బతుకు మలినమవుతుందన్నది సారాంశం. బీఎం రెడ్డి దర్శకత్వంలో పీఎస్ నారాయణ మూలకథ చేయగా పరమాత్మని శివరాం నాటకీకరణ చేశారు.

ఆద్యంతం నవ్వించిన 'వర్క్ ఫ్రమ్ హోం'

మనసుకు నచ్చిన పని చేస్తున్నపుడు ఓ ప్రతిభ వెలుగుచూస్తుంది. ఒక్కోసారి అదే చిక్కులు తెచ్చిపెడుతుంది. వాటిని అధిగమించి ముందుకు సాగినపుడే విశ్వ విజేత అవుతాడన్న సారాంశంతో సాగిన నాటిక వర్క్ ఫ్రం హోమ్. బాపట్ల సహృదయ ద్రోదాదుల బృందం ఈ నాటికను ప్రదర్శించారు. కేకే భాగశ్రీ రచించగా అద్దేపల్లి భరత్‌కుమార్ నాటకీకరణలో డి.మహేంద్ర దర్శకత్వం వహించారు.

ఎవరు రాసిన రాత?


'స్వేచ్ఛ' నాటికలోని సన్నివేశం

వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ బృందం పోలుదాసు శ్రీనివాస్ రచించి, దర్శకత్వం వహించిన 'రాత' నాటికను మూడో ప్రదర్శనగా ప్రదర్శించారు. మనిషి కష్టాలకు తన తలరాతను నిందిస్తూ సుఖం వచ్చినపుడు పట్టించుకోకుండా బాధ్యతా రాహిత్యంగా ఉంటూ అతని నైజం వల్ల సమాజం తిరోగమనంవైపు వెళ్తోందని, ఇందుకు కారణం ఎవరని సాగే నాటిక 'రాత' ద్వారా వివరించారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

- ఆర్డీఓ శ్రీరమణి
- ఉత్సాహంగా జాతీయ ఓటరు దినోత్సవం


ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ, మానవహారం చేయిస్తున్న అధికారులు

పెద్దాపురం: అర్హులైన ప్రతి ఒక్కరూ 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందని ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్గి ఉండాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా బలమైన ఆయుధమని పేర్కొన్నారు. శాఖల సమన్వయంతోనే ఓటు నమోదు ప్రక్రియలో 95 శాతం ముందుంజలో ఉన్నామన్నారు. ఫారం 6తో మీ సేవా కేంద్రాల్లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి మున్సిపల్ సెంటర్ మెయిన్ రోడ్డు, మరిడమ్మ గుడి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను ఆర్డీఓ శ్రీరమణి సత్కరించారు. కార్యక్రమంలో డీటీలు భానుకుమార్, కాంతారావు, వార్డు సచివాలయాల సిబ్బంది, వార్డు వలంటీర్లు, ఆర్పీలు, మహారాణి కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దివిలి కిట్స్‌లో..

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహించింది.

ఓటు హక్కుపై అవగాహన అవసరం : మున్సిపల్ కమిషనర్


కొత్తపల్లిలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు

సామర్లకోట: ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ యువత తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏఎస్ఓ పెంకే శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు కశంరెడ్డి నూకరాజు, సత్యవతిలను వారు సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఓటు హక్కుపై కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యు.సత్యనారాయణ, పీడీ వెంకటేశ్వర్లు, సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయం నుంచి ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కాగ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు లేక పోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటర్లతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు.

పిఠాపురంలో..

పిఠాపురం: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు బలమైన ఆయుధమని అందరు ఓటుహక్కును వినియోగించుకోవాలని పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు ఎంవీవీ గోపాలకృష్ణ, సత్యనారాయణ, సీఐ శ్రీనివాస్, పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుభాషిణి, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు తదితరులు పిలుపు నిచ్చారు. పిఠాపురం, గొల్లప్రోలులో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సన్మానించి, కొత్త ఓటర్లకు ఓటర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఓటర్లు పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్


సామర్లకోటలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్



దివిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కిట్స్ విద్యార్థులు


గొల్లప్రోలులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి	
గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమానాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629